క్లుప్తంగా

పది మంది జూదరుల అరెస్టు


జూదరులను అదుపులోకి తీసుకున్న ఎస్సై రమేష్‌బాబు

మద్దిపాడు: మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రాశివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్సై రమేష్‌బాబు ఆదివారం తమ సిబ్బందితో స్థావరాలపై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద ఉన్న నాలుగు కోళ్లు, రూ. 6,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని పేకాట, కోడిపందేలు, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం


బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కే బిట్రగుంట పంచాయతీలోని ఎస్సీ కాలనీలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న పెరికాల సుబ్బారావును ఆదివారం అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సింగరాయకొండ ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆమె వివరించారు.

వెలుగొండ జలాల కోసం ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో సీపీఎం నాయకులు

కనిగిరి రూరల్: ఈనెల 23న కనిగిరిలో జరిగే వెలుగొండ జలాల సాధన సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు మాట్లాడుతూ వెలిగొండ జలాలతోనే వెనుకబడిన కనిగిరి ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. స్థానిక సుగుణావతమ్మ సెంటర్‌లో జరిగే ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాలకొండయ్య, చెన్న కేశవులు, నరేంద్ర, లక్ష్మీ, ప్రసన్న, శాంతకుమారి, ఆదిలక్ష్మీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

పామూరు: మానవతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలువురు పేదలు, బాధితులకు ఆదివారం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మునయ్య, ఎన్.బాబురావులు ఆర్థిక సాయం చేశారు. ఈసందర్భంగా మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన అట్లూరి దయామణికి రూ.5 వేలు, కోలా తిరుపాలుకు రూ.5 వేలు, నెల్లూరు జిల్లా వరికుంటపాడుకు చెందిన సంచిబోయిన మాల్యాద్రికి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వి.వెంకటేశ్వరరెడ్డి, తోట రమేష్, పి.తిరుపతిరెడ్డి, శేగు కృష్ణయ్య, నాగేశ్వరరావు, మాల్యాద్రి, బాషా మొహిద్దీన్, తిరుపతిరెడ్డి, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆవిరి !


బల్లలు విరిగిపోవడంతో ఖాళీగా ఉన్న దిమ్మెలు


పిచ్చిచెట్లతో చిట్టడవిని తలపిస్తున్న పార్కు

- చిట్టడవిని తలపిస్తున్న డీవీ పార్క్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పార్కు నిర్వహణ గాలికి వదిలేసిన పంచాయతీ
- పత్తాలేని ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు

పామూరు:

ఆధునిక సాంకేతిక యుగంలో ఇప్పుడు అందరిదీ ఉరుకుల పరుగుల జీవితం. క్షణం తీరిక ఉండదు. ఎప్పుడూ పని.. పని అంటూ నిత్యం ఒత్తిడిలో చిత్తవుతున్న కాలం ఇది. అలాంటిది ఏ సెలవు రోజుల్లోనో కాస్త సేదతీరుదామంటే పచ్చంగా ఉండే పార్కులు కనుమరుగవుతున్నాయి. పామూరు మేజర్ గ్రామ పంచాయతీ జనభా రోజు రోజుకూ పెరిగిపోతున్నా ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షలాగే మిగిలిపోతోంది. 18 వార్డులతో సుమారు 25 వేల చిలుకు జనాభా కలిగి ఉన్న పామూరులో ఉన్న ఏకైక పార్కు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఖాళీ సమయాల్లో ప్రజలు ప్రశాంతంగా సేదతీరుదాం అనే వారి ఆశలు మాత్రం అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. పామూరులోని కందుకూరు రోడ్డులో సుమారు 17 ఏళ్ల క్రితం పార్కును ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ పంచాయతీ చేపట్టింది. ఈసందర్భంలో దాతలు కొందరు ముందుకు వచ్చి దరిశి వీరాంజనేయులు పార్క్ పేరుతో పార్కులో పూలమొక్కలు, కూర్చునేందుకు బెంచీలు, వ్యాయామం కోసం పరికరాలు, పిల్లల ఆటల కోసం క్రీడా పరికరాలు ఏర్పాటు చేయగా పార్కు ఎంతో సుందరంగా, ఆహ్లాదంగా పార్కు కళకళలాడేది. సెలవుదినాల్లో పిల్లలు ఆటలాడుకుంటూ ఉల్లాసంగా గడిపేవారు. అదేవిధంగా విద్యార్థులు పరీక్షల కోసం ప్రశాంతంగా ఓపక్క కూర్చుని చదువుకునేవారు. కాగా క్రమేణా పంచాయతీ పార్కు


పార్కులో మద్యం తాగి పడేసి ఉన్న గ్లాసులు



డీవీ పార్క్ ప్రధాన గేట్

నిర్వహణను గాలికి వదలివేయడంతో పార్కు కళావిహీనంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీనికితోడు కొందరు ఖర్మకాండలు నిర్వహిస్తుండటంతో అనుమానాలకు తెరతీసి పార్కుకు వచ్చేవారే కరువవుతున్నారు. దీంతో పార్కు కంపచెట్లతో చిట్టడవిని తలపిస్తోంది.

పార్కు నిర్వహణను వదిలేసిన పంచాయతీ అధికారులు ..

కనీసం పార్కును శుభ్రంచేసే వారు సైతం కరువయ్యారు. చెత్త, పిచ్చి మొక్కలు, ముండ్లచెట్లు, తాగిపడేసిన మద్యం బాటిళ్లు, గ్లాసులు ఇలా పార్కు అధ్వానంగా ఉంది. నాడు ఉన్న సిమెంట్ బెంచీలు విరిగిపోగా, అరుగులు పగులగొట్టారు. అదేవిధంగా పార్కులో చెట్లకు నాడు కట్టించిన అరుగులు సైతం శిథిలావస్థకు చేరుకోగా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాగా ఇంటి పన్ను పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున పంచాయతీ అధికారులు అందరికి ఉపయోగపడే పార్కు నిర్వహణను గాలికి వదలివేయడం ఎంత వరకు సబబు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆటవస్తువులు, వ్యాయామ పరికరాలు మాయం..

పార్కులో గతంలో ఉన్న ఆటవస్తువులు, వ్యాయామ పరికరాలు పత్తాలేవు. ఇవి చోరీకి గురయ్యాయా లేక తుప్పుపట్టి పాడయ్యాయా అర్థంకాని పరిస్థితి నెలకొంది. కాగా పార్కుకు వాచ్‌మెన్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో కొందరు తాగుతూ ఉంటారు. అటువైపు వెళ్లామన్నా భయపడే పరిస్థితి నెలకొంది. ఆప్రాంతం ద్వారానే ప్రభుత్వ వైద్యశాలకు, పెట్రోల్ బంక్‌లకు వెళ్లే మార్గం కావడంతో ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

పార్కు అధ్వానంగా మారింది..



డీవీ పార్కు గతంలో చాలా సుందరంగా ఉండేది. వాకింగ్, వ్యాయామం కోసం పెద్దలు, పిల్లలు వచ్చేవారు. ప్రస్తుతం పంచాయతీ నిర్వహణను గాలికి వదిలేడయంతో పార్కు కళావిహీనంగా మారి పిల్లలు, మహిళలు, పెద్దలు పార్కుకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చెట్లు మొలిచి అడవిని తలపిస్తోంది. పార్కును బాగుచేసి పూర్వవైభవం తీసుకురావాలి.

– షేక్.గయాజ్, పామూరు

పార్కు అభివృద్ధికి కృషిచేస్తాం ..



డీవీ పార్కును పరిశీలించి అభివృద్ధికి కృషిచేస్తాం. పంచాయతీ నిధులు, లేక దాతల సాయంతో నైనా పార్కు అభివృద్ధి పనులు చేపట్టి పార్కుకు పూర్వవైభవం తెస్తాం. పార్కులో అసాంఘిక కార్యకలాపాలు అరికడతాం.

– గవిరెడ్డి అరవింద, పంచాయతీ

రీ సర్వే చట్టాన్ని మళ్లీ ఎందుకు వాడుతున్నారు ?

- వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శేషారెడ్డి


కనపర్తి శేషారెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా జగన్ భూములు లాక్కుంటారని ఎన్నికల్లో విషప్రచారం చేసి అధికారంలోకి వచారని.. తీరా వచ్చాక తొలి సంతకంతో చట్టాన్ని రద్దు చేసి నేడు మళ్లీ భూముల రీసర్వే ప్రారంభించడం ఏంటని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు తన పచ్చమీడియా సహకారంతో జగన్‌పై అసత్య ప్రచారం చేసి ఒక మోసగాడిలా ఎన్నికల్లో ప్రచారం చేసి నేడు మళ్లీ అన్ని మండలాల్లో రీ సర్వే ప్రారంభించడం పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గతంలో రీ సర్వే ద్వారా జగన్ ప్రజల భూములు లాక్కుంటే నేడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ లాక్కుంటారా అని ఎద్దేవా చేశారు. కేంద్రప్రభుత్వం కూడా జగన్ ప్రభుత్వాన్ని రీసర్వే బాగా చేశారని కొనియాడిందని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తే ఆ శాఖ మంత్రి వలంటీర్ వ్యవస్థే లేదని, లేని బిడ్డకు పేరు ఎలా పెడతామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన స్వామి లేని శాఖకు మంత్రిగా ఎలా ఉన్నాడని ప్రశ్నించారు. ఇకనైనా జగన్‌పై అసత్య ప్రచారం మానుకుని జగన్ పథకాలను సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యువతకు క్రీడా స్ఫూర్తి అవసరం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, చైర్మన్

కనిగిరి రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్‌లు అన్నారు. మండలంలోని వాగుపల్లిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించి క్రికెట్ పోటీల్లోని విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థి, యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. పార్టీ యూత్ విభాగం ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించడాన్ని కొనియాడారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏరువారిపల్లి టీంకు మొదటి బహుమతి సర్పంచ్ మూలే గోవిందరెడ్డి రూ.20 వేలు, వాగుపల్లి టీంకు ద్వితీయ బహుమతి మూలే గోపాల్‌రెడ్డి రూ.15 వేలు, వాగుపల్లి జూనియర్స్‌కు తృతీయ బహుమతి వెంకటగిరి మాల్యాద్రి రూ.10 వేలు అందచేశారు. కార్యక్రమంలో పార్టీ విద్యార్థి, యూత్ విభాగం నాయకులు మూలే గోపాల్‌రెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, మడతల వెంకటేశ్వర్లు, మిట్టా రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు మూలే గోవిందారెడ్డి, ముద్దా బాబు, దమ్ము వెంకటయ్య, గ్రామ కమిటీ సభ్యులు వీరంరెడ్డి బాబు, వెంకటేశ్వరరావు, నాగేంద్రబాబు, భార్గవ్, ఇర్మానియా, ప్రసంగి, ఈశ్వరావు, రమేష్, సైదులు, హనుమంతు, చిన్న వెంకట సుబ్బయ్య, కృష్ణారెడ్డి, వెంకట నారాయణ, శివారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

ఏరువారిపల్లిలో..

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఏరువారిపల్లి యూత్ ఆధ్వర్యంలో ఏరువారిపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లోని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన హాజీపురం టీంకు ప్రథమ బహుమతి రూ.30 వేలు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి అందచేయగా, ద్వితీయ బహుమతి ఏరువారిపల్లి టీంకు రూ. 20 వేలు ఏరువా చిన్నపరెడ్డి అందచేసినట్లు సర్పంచ్ దమ్ము వెంకట తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కనిగిరి రూరల్: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కనిగిరి మండలంలోని బొటికిర్లపాడుకు చెందిన గంగవరపు మల్లికార్జునరెడ్డి (48) ఈనెల 3న బైక్ పై ఇంటికి వెళ్తుండగా నల్లారెడ్డిపల్లి గ్రామం వద్ద అకస్మత్తుగా అడ్డు వచ్చిన పిల్లవాడిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న మల్లికార్జునరెడ్డికి తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చెన్నై అపోలో ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై టీ శ్రీరామ్ తెలిపారు.

☛ కనిగిరి మండలంలోని బాలవెంకటాపురానికి చెందిన మడతల ఓబులమ్మ (67) ఆదివారం పాలక్యాన్లు తీసుకుని పాలు పోసేందుకు ఆటో ఎక్కి వెళ్తుండగా.. అర్బన్ కాలనీ సమీపంలో ప్రమాదవ శాత్తు జారీ ఆటో నుంచి కింద పడింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రు రాలిని ఒంగోలు రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై టీ శ్రీరామ్ తెలిపారు.

ఘనంగా రఘురాములు సంస్మరణ సభ

కనిగిరి రూరల్: విశ్రాంత పీడీసీసీ బ్యాంక్ మేనేజర్, ఉమా రామలింగ చౌడేశ్వర దేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు దివంగత గొర్రె రఘు రాములు చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీ రఘు రాములు సంస్మరణ సభ ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఎంపీటీ వట్టివేళ్ల రంగబాబు, కే సుబ్బారావు, నారపురెడ్డి శ్రీను, దేవాంగ సంక్షేమ సంఘ నాయకులు, వైద్యులు నరేంద్ర, మల్లిబాబు, డీఈ గొర్రె సతీష్‌బాబు, గ్రామ నాయకులు, పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవ కార్యక్రమాలు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం శ్రీనారాయణ స్వామి వారి మూల విగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించి భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి మహా నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, మన్నేపల్లి శ్రీనివాసులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

టంగుటూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ నిర్వాహకుడు గుమ్మడివర్ధన్ రాజు తెలిపారు. టంగుటూరు గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు గ్రంథాలయంలో పుస్తకాలు చదివారు. కార్యక్రమంలో పాఠకులు గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వసతుల లేమితో టంగుటూరు బస్టాండ్

- మౌలిక వసతులు లేక ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


ఉదయం 10:30 మూసివేసి ఉన్న మరుగుదొడ్లు

టంగుటూరు: ప్రయాణికుల భద్రతే మా ప్రథమ కర్తవ్యం.. అందుకు వారికి బస్టాండ్‌లో సరైన వసతులు కూడా కల్పించాల్సిన బాధ్యత మాదే అని అధికారులు అప్పుడప్పుడూ చిలకపలుకులు పలుకుతుంటారు. కాని ఎక్కడా వసతులు కల్పించిన పాపాన పోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రధాన సెంటర్ టంగుటూరు. ఎప్పుడూ నిత్యం రద్దీగా ఉంటుంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇక్కడకు వచ్చి వెళ్తుంటారు. ఈక్రమంలో టంగుటూరు ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. గతంలో సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించింది. వెంటనే స్పందించిన అధికారులు అప్పటికప్పుడు పైపైన మెరుగులు దిద్దారు. కాని అవి మూన్నాళ్ల ముచ్చటంగా మారింది. కంట్రోల్ పాయింట్ సాయంత్రం 4 గంటలు అయ్యేసరికి మూసివేస్తున్నారు. ప్రయాణికుల మరుగుదొడ్లు దుర్వాసన కొడుతున్నాయి. మరుగుదొడ్లను మూసివేయడంతో పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను ఉపయోగించుకుంటున్నారు. బస్టాండ్ లోకి కొన్ని బస్సులు మాత్రమే వస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా కొన్ని బస్సులు మాత్రమే ఇక్కడకు వస్తున్నాయని, కొత్త సర్వీసులు జాతీయ రహదారిపై వెళ్తున్నాయని ఈవిషయమై ఆర్ఎం సుధాకర్‌ను సాక్షి వివరణ కోరగా బస్టాండ్‌లో పరిస్థితుల గురించి డీఎంతో మాట్లాడమని చెప్పాడు. వెంటనే డీఎంతో మాట్లాడగా అన్ని సవ్యంగానే ఉన్నాయి అంటూ తప్పులను కప్పిపుచ్చుకుంటూ సమాధానం ఇచ్చాడు.

బస్టాండ్ పరిస్థితి అధ్వానంగా ఉంది.



కొన్ని బస్సులు మాత్రమే బస్టాండ్ లోకి వస్తున్నాయి. కొన్ని సర్వీసులు హైవేల మీద వెళ్లిపోతున్నాయి. రాత్రి వేళలో మందు బాబులకు అడ్డగా మారుతోంది. బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించాలి.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే


పచ్చాకు డ్రైవర్ల వివరాలు నమోదు చేస్తున్న ఎస్సై మహేంద్ర


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న జరుగుమల్లి ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి: మద్యం తాగి వాహనదారులు వాహనాలు నడిపితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్, కామేపల్లి సెంటర్, బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడతారని, మిమ్మల్ని నమ్ముకొని కుటుంబాలు పిల్లలు ఎదురు చూస్తుంటారని, మద్యం తాగకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చాకు ట్రాక్టర్లు, ఆటోలు నిబంధనలు పాటించాలి..

జరుగుమల్లి (సింగరాయకొండ): పొగాకు పచ్చాకు రవాణా చేసే ట్రాక్టర్లు, వ్యవసాయ కూలీలను తరలించే ఆటోలు నిబంధనల ప్రకారం నడపాలని ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వాహన యజమానులతో పాటు, డ్రైవర్, పచ్చాకు తరలించే రైతులపై కూడా కేసులు నమోదు చేస్తామని ఎస్సై బి మహేంద్ర హెచ్చరించారు. ఈ సందర్భంగా జరుగుమల్లి రోడ్డులో పచ్చాకు ట్రాక్టరు డ్రైవర్లు, కూలీలకు ఆయన అవగాహన కల్పించారు.

మంత్రివర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలి



పామూరులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పామూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి సయ్యద్ హనీఫ్‌లు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రం పామూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన వారికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, మోహనరావు, ప్రసాద్, మహేష్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


పామూరులో 46 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పామూరు: మండల కేంద్రమైన పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (నాటి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల) 1978–79 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం ఆదివారం స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో పూర్వవిద్యార్థి డాక్టర్ ఖాదర్ బాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 33 మంది విద్యార్థులు హాజరుకాగా తాము విద్యార్థులుగా ఉన్న 46 సంవత్సరాల నాటి సంగతులు గుర్తు చేసుకుని మురిశారు. కార్యక్రమానికి వచ్చిన నాటి హెచ్‌యం ఓరుగంటి శింగయ్య, ఉపాధ్యాయులు పెరుగుపల్లి సుబ్రమ ణ్యం మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక మధురానుభూతిని మిగిల్చిందన్నారు. గడిచిన కాలం ఎంతో మానవత్వం, మంచితనంతో కూడిందని, నేడు సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. 46 సంవత్సరాల తరువాత ఈకలయిక తమజీవితంలో మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ప్రస్తుత హెచ్ఎం రామస్వామి, జీజేసీ అధ్యాపకుడు గుత్తి రమణయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణం దీక్షితులు, ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కేతు వెంకటరామిరెడ్డి, జగదాబి మాల్యాద్రి, సయ్యద్ చినమౌలాలి, గౌస్‌బాషా, సయ్యద్‌మౌలాలి, కందుల నారాయణరెడ్డి పలువురు పాల్గొన్నారు.